## అద్దె వాహనాల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని, జూలై 3 : ఆర్జీ-1లో భూ నిర్వాసితుల అద్దె వాహనాల సమస్యలు పరిష్కరించాలని వాహనాల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సమ్మయ్య కోరారు. ఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. వాహనాల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈ నెల 5 వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. సింగరేణి భూ నిర్వాసిత యువకులకు ఆర్జీ-1లో అద్దె వాహనాలు పెట్టుకునేందుకు అవకాశం కల్పించి ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం బిల్లులు ఇవ్వకుండా పాత పద్ధతిలోనే ఇవ్వడంతో చాలా నష్టపోతున్నామన్నారు. సీఎంపీఎఫ్ రద్దు చేసి యూనిట్ రేట్ వేరియేషన్ విధానం పొందుపర్చాలని, వాహనాల యూనిట్ రేటును 2017 నుంచి పెంచడం లేదని, 3 యేండ్ల కాల పరిమితిని వాహనాలకు 6 ఏండ్లకు పెంచాలని, అదనపు కి.మీ.కు రూ.20 చెల్లించాలని కోరారు. ఓసీపీలో నడుపుతున్న అద్దె వాహనాలకు స్లాబ్ రేట్ పెంచాలని, 12 గంటల వాహనాలు రద్దు చేసి 8 లేదా 16 గంటలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే సంస్థనే భరించాలని తదితర డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుందిళ్ల నాగరాజు, తోడేటి సదానందం, శ్రీనివాస్, మల్లేశ్, రమేశ్, శంకర్, కుమారస్వామి, తిరుపతి, వెంకన్న పాల్గొన్నారు.

## ప్రాజెక్టు అధికారిగా బాధ్యతల స్వీకరణ

రామగిరి, జూలై 3 : ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారిగా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు చేతుల మీదుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

# 'కొత్త' వెలుగులు



- కార్మికుల ఖాతాల్లో నూతన వేజ్‌బోర్డు వేతనాలు
- 41వేల మందికి ప్రయోజనం
- కోలిండియా కంటే ముందే అమలు
- సంస్థపై ఏడాదికి రూ.వెయ్యి కోట్ల అదనపు వ్యయం

రామగిరి, జూలై 3 : సింగరేణి కార్మికుల జీవితాల్లో సోమవారం 'కొత్త' వెలుగులు నిండాయి. సోమవారం ఎప్పటిలాగే గనుల్లో విధులకు హాజరైన కార్మికులు కొత్త వేజ్ బోర్డు వేతనాలను అందుకొని మరింత ఉత్సాహంతో ఇంటికెళ్లారు. కోలిండియా కంటే ముందుగానే సింగరేణి సంస్థలో కార్మికులకు యాజమాన్యం వేజ్‌బోర్డు జీతాలను అందజేయగా, దీంతో సంస్థకు రూ.1000 కోట్ల అదనపు వ్యయం పడనున్నది. సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశంతో యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేయగా, కొత్త జీతాలు అందుకున్న కార్మికులు అదే ఉత్సాహంతో లక్ష్య సాధనకు శ్రమించాలని సీఎండీ పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఇటీవల కుదిరిన 11వ వేతన ఒప్పంద వేతనాలను కార్మికులకు తక్షణమే యాజమాన్యం అమలు చేసింది. సీఎండీ ఆదేశాలతో సంస్థ డైరెక్టర్ బలరాం స్వీయ పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేసి జూన్ జీతాలను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. గత 10 వేజ్‌బోర్డు వేతనాల అమలుతో పోలిస్తే ఇది ఒక సంచలన నిర్ణయంగా చెప్పవచ్చు. గతంలో వేజ్‌బోర్డు నిర్ణయాలు జరిగిన తర్వాత జీతాల చెల్లింపునకు నెలల తరబడి సమయం పట్టేది. కోలిండియాలో అమలు జరిపిన తర్వాతే సింగరేణిలో అమలు చేసే పరిస్థితి ఉండేది. కానీ, అందుకు భిన్నంగా ఎవరూ ఊహించని విధంగా కార్మికులకు కొత్త వేజ్‌బోర్డు జీతాలు అందించడం విశేషంగా కార్మిక వర్గం చెబుతున్నది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి బొగ్గు గని ఉద్యోగుల వేతనాలను చర్చించి నిర్ణయించే జేబీసీసీఐ సమావేశాలు ఈ మధ్యే ముగిసిన విషయం విదితమే. దేశంలోని బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగుల జాతీయ వేతన ఒప్పందం ద్వారా పెరిగిన బేసిక్ ఇతర అలవెన్సులను ఈనెల జీతాల నుంచే ఉద్యోగులకు చెల్లించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. జేబీసీసీఐ వద్ద అంగీకరించిన వివరాల ప్రకారం భూగర్భ ఉద్యోగి కనిష్ఠ, గరిష్ఠ స్థాయి డిసిగ్నేషన్ల జీతాలు గణనీయంగా పెరిగాయి. మారిన కొత్త బేసిక్‌ల ప్రకారం డైలీ రేటెడ్ కేటగిరీ-1 ఉద్యోగి స్థూలంగా నెలకు రూ.59,386. 57 జీతంగా పొందారు. మంత్లీ రేటెడ్ ఉద్యోగులు స్థూలంగా నెల జీతం రూ.2,16,618. 74 పొందారు. కాగా, పెరిగిన వేతనాలను సద్వినియోగం చేసుకుంటూ కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకతకు తోడ్పడాలని సీఎండీ శ్రీధర్ కోరారు. కోలిండియాలో ఇంకా వేజ్‌బోర్డులో నిర్ణయించిన వేతనాల చెల్లింపు జరగకముందే సింగరేణిలో జూన్ నెల జీతాలతో పెరిగిన బేసిక్ అలవెన్సులను అమలు చేస్తుండడం విశేషం. ఉద్యోగుల సంక్షేమం కోసం ఇతర సంస్థలతో పోలిస్తే సింగరేణి ముందంజలో ఉంటుందని సీఎండీ పేర్కొన్నారు. కాగా, రామగుండం రీజియన్‌లో నిపలు భూగర్భ, ఓసీపీల గనుల్లో కార్మికులు విధులు ముగించుకొని కొత్త వేతనాలు బ్యాంకుల్లో జమ అయ్యాయని తెలిసి ఆనందంతో ఇంటికి వెళ్లడం కనిపించింది. ఎక్కడ చూసినా నలుగురు కార్మికులు కూడిన చోట ఎవరికి ఎంత పెరిగాయనేది చర్చ వినిపించింది.

### కార్మికులకు శుభాకాంక్షలు

గోదావరిఖని, జూలై 3 : సింగరేణిలో కొత్త జీతాలు జూన్ నుంచి అమలు చేసి జూలై 3న పేమెంట్ చెల్లిస్తున్నందున యాజమాన్యానికి, అన్ని విధాలా కృషి చేసిన సిబ్బందికి టీబీజీకేఎస్ పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆ సంఘం నాయకులు మెండె శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త జీతాలు ఈ నెల నుంచి అమలు కావటేదని అబద్ధపు ప్రచారాన్ని ఆయన ఖండించారు. సింగరేణికి భిన్నంగా కోలిండియాలో అటెండెన్స్ బోనస్‌ను జూన్ వేతనంతో చెల్లిస్తున్నారని, ఇది ఐదేండ్లుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మారం, జూలై 3: ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలోని జక్కన్నపల్లిలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు భూమి పూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎంపీటీసీకి రూ.10 లక్షల నిధులను ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరు చేసింది. దీంతో ఇక్కడ ఎంపీటీసీ -1 తుమ్మల రాంబాబు ఇక్కడి వార్డులో ఎస్సీ గురుకుల విద్యాలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించాలని సంకల్పించారు. ప్రజాప్రతినిధులు కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఇక్కడ జడ్పీటీసీ పూస్కూరు పద్మజ, సర్పంచ్ పూస్కూరు జితేందర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ పాకాల రాజయ్య, జిల్లా సభ్యులు పూస్కూరు రామారావు, ఎగ్గెల స్వామి, మండల అధికార ప్రతినిధి గుర్రం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ ఆవుల లత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, పట్టణాధ్యక్షుడు బాస తిరుపతి రావు, మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్,ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ బాబా, నాడెం శ్రీనివాస్, యూత్ నాయకులు దేవి అజయ్, రాగుల చిన్న మల్లేశం, ఎండీ అజాం బాబా, బెంబడి పోచయ్య, మల్లేశం తదితరులున్నారు.

# మైనింగ్ విద్యార్థులకు అభినందన



జేఎన్టీయూ విద్యార్థులతో ఆర్జీ-2 జీఎం మనోహర్

యైటింక్లయిన్ కాలనీ, జూలై 3 : మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను ఆర్జీ-2 జీఎం ఐత మనోహర్ సోమవారం అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. 7ఎల్‌ఈపీ గని సందర్శనకు వచ్చిన పర్యాటకులకు భూగర్భ గనుల స్థితిగతులు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా జేఎన్టీయూ మైనింగ్ విద్యార్థులు వర్చువల్ కోల్‌మైన్ సాఫ్ట్ మైనింగ్ సిస్టంను తయారు చేశారు. దీనికిగానూ వారి ప్రతిభకు గుర్తింపుగా జీఎం అభినందించారు. రాబోయే రోజుల్లో కోల్ మైనింగ్‌పై మరింత అవగాహన పెంచుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇక్కడ డీజీఎం(ప) రాజేంద్రప్రసాద్, ఐఈడీ మురళీకృష్ణ తదితరులున్నారు.

## ఖిలావనపర్తిలో పెద్దమ్మ పట్నాల ఉత్సవాలు


ధర్మారం, జూలై 3: ఖిలావనపర్తిలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ దేవత పట్నాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మత్స్య సహకార సొసైటీ, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి బోనాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు మంత్రి సతీమణి కొప్పుల స్నేహలత హాజరై బోనం ఎత్తుకున్నారు. బైండ్ల పూజారుల విన్యాసాల మధ్య ముదిరాజ్ మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపులో గుడికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు పట్టు పరిచి పట్నాలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఇక్కడ ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సర్పంచ్ సాగంటి తార-కొండయ్య, ఎంపీటీసీ మోతె సుజాత కనుకయ్య, ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఉప సర్పంచ్ కీసర స్వరూపారాణి- స్వామి, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి గుర్రం మోహన్ రెడ్డి, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ పాకాల రాజయ్య, జంగిలి గట్టు స్వామి, మత్స్య సహకార సొసైటీ, ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరస్వామి, నూనె మల్లేశ్, మోతె వెంకట స్వామి, మోతె అంజయ్య, మోతె చంద్రయ్య, సాగంటి నర్సయ్య, గుజ్జేటి మల్లేశ్, పోలుదాసరి సంతోష్, మోతె రాజు, గుజ్జేటి కనకలక్ష్మి హాజరయ్యారు.

## సన్మానం

యైటింక్లయిన్ కాలనీ, జూలై 3 : కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్టీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో జూన్ 16 నుంచి 30 వరకు స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సఫాయి కర్మాచారీ ఉద్యోగులను జీఎం మనోహర్ సోమవారం సన్మానిం చారు. జీఎం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సఫాయి కర్మాచారీ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఇక్కడ టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్, డీజీఎం(ప) జీ రాజేంద్రప్రసాద్, డీజీఎం(సి) ధనుంజయ్, డీజీఎం మురళీకృష్ణ, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు, పీఎంలు ఎస్ అనిల్ కుమార్, వేణుగోపాల్, వంశీధర్, మండల శ్రీనివాస్, పీవీ రమణ, పిట్ సెక్రటరీ చిప్ప సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి చొరవతోనే న్యూ కొత్తపల్లి అభివృద్ధి

ధర్మారం,జూలై 3: మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవ చూపడంతో న్యూ కొత్తపల్లి గ్రామంలో అనతి కాలంలోనే అభివృద్ధి చెందినట్లు నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆ గ్రామంలో మంత్రి ఆదేశాల మేరకు పనులకు భూమి పూజ చేశారు. రూ.4.50 లక్షలతో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంతో పాటు మరో రెండు ప్రదేశాలలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సర్పంచ్ దార మల్లమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే రూ.13 లక్షలతో 3 సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. జీపీ పక్కన రూ.8 లక్షలతో ఎస్సీ మాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బలరాంరెడ్డి మాట్లాడారు. చామనపల్లి నుంచి న్యూ కొత్తపల్లి గ్రామ పంచాయతీని మంత్రి ఏర్పాటు చేయించారని అన్నారు. నాలుగేళ్లలోనే సుమారు రూ.కోటి విలువైన పనులు జరగడం గమనార్హమని బలరాంరెడ్డి వివరించారు. ఇక్కడ ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఐతరవేని రమేశ్, ఎంపీటీసీ మిట్ట తిరుపతి, వార్డు సభ్యులు తీగెల రవీందర్, ఉత్తెర్ల సునీత, మాదాని తిరుపతి, మల్లేశం, జుంజిపల్లి సురేందర్, ఉత్తెర్ల నర్సయ్య, నందాల లచ్చయ్య, రాయమల్లు, తిరుపతి, మల్లయ్య, జీపీ కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో క్లబ్ సభ్యులు

## దుర్గాదేవీ ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలు

గోదావరిఖని, జూలై 3 : అధికారుల నివాసం బంగ్లాస్ ఏరియాలోని శ్రీ దుర్గాదేవీ అమ్మవారి ఆలయంలో సోమవారం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అమ్మవారిని, ఆలయాన్ని అలంకరించి శాకాంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్జీ-1 సేవా సమితి అధ్యక్షురా లు చింతల లక్ష్మి-శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీఎంల సతీమణులు, ఆలయ కమిటీ సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు బోనాలు ఎత్తుకొని ప్రదర్శనగా అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదానం చేశారు. జీఎంల సతీమణులు సవిత-మనోహర్, జయ-సాంబయ్య, మాలతి-సూర్యనారాయణ, పద్మ, శ్రీదేవి టీవీ రావు, విజయ వెంకటేశ్వర్లు, సభ్యులు బీనాసింగ్, నీరజ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సిక్కా కేంద్ర ఉపాధ్యక్షుడిగా..

జయశంకర్ భూపాలపల్లి, జూలై 3 (నమస్తే తెలంగాణ) : కార్మికుల సమస్యల పరిష్కార వేదికైన సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ (సిక్కా) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా దాసారపు సంజీవ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం తోటి ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. బ్రాంచ్ కార్యదర్శులుగా రాంచందర్, గంగినేని సతీశ్ ఎన్నికయ్యారు.